## 9న కలెక్టరేట్‌లో యువతకు జాబ్ మేళా

**ప్రజాశక్తి-రాజమహేంద్రవరం**

ఈ నెల 9న ఉదయం 9 గంటలకు బొమ్మూరులోని కలెక్టరేట్ బిల్డింగ్‌లో యువతకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయ అధికారి హరిశ్చంద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో 4 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు గల అభ్యర్థులు 19 నుంచి 30 ఏళ్ల వయసు వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఉద్యోగ ఆసక్తి గల అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు అందరూ న్యాక్ సెంటర్, కలెక్టరేట్ బిల్డింగ్, బొమ్మూరులో ఈ నెల 9వ తేది ఉదయం 10 గంటలకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పూర్తి కాని తాడిపూడి ప్రాజెక్ట్ పనులు

- అసంపూర్తిగా కాలువ నిర్మాణం
- ఆయకట్టుకు పూర్తిస్థాయిలో అందని సాగునీరు
- కనుమరుగవుతున్న తాడిపూడి కాలువ

**ప్రజాశక్తి-గోపాలపురం**

తాడిపూడి ప్రాజెక్టు ప్రారంభించి 18 ఏళ్లు గడుస్తున్నా నేటికీ అసంపూర్తిగానే పనులు, అసంపూర్తిగానే నీటి విడుదల, నీరు పంటలకు అందకుండ వృథా అవుతోందని రైతులు వాపోతున్నారు. కనీసం పదివేల ఎకరాలకు కూడా సాగునీరు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

2005-2006లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గోదావరి నదీ తీరాన తాడిపూడి మెయిన్ లిఫ్ట్ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు తాడిపూడి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. తాడిపూడి మెయిన్ లిఫ్టును సుమారు రూ.63 కోట్ల నిధులతో పనులు ప్రారంభించారు. 2008లో దేవరపల్లి మండలం బంధపురం వద్ద సుమారు రూ.60 కోట్లతో లిఫ్ట్-5 సబ్ లిఫ్టును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. నీటిని తూతూ మంత్రంగానే విడుదల చేస్తున్నారు. లిఫ్ట్-4 భూ సమస్యల కారణంగా పనులు ప్రారంభంలోనే ఆగిపోయాయి. లిఫ్ట్-5 ప్రాజెక్టు సుమారు 70 శాతం పనులు పూర్తయినప్పటికీ మూడేళ్లు మాత్రం నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత పలు సమస్యల కారణంగా పూర్తిస్థాయిలో మైనర్లు, ఫీల్డ్ ఛానల్స్ తవ్వకపోవడంతో నీటిని విడుదల చేయడం లేదు. మిగులు పనులు పూర్తి చేయడం లేదు, ఆధునికీకరణ పూడికతీత పనులకు సైతం నిధులు విడుదల కాకపోవడంతో ప్రాజెక్టులు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు.

27 గ్రామాల్లో మొత్తం ఆయికట్టు 27,800 ఎకరాలకు నీరు అందించాలి. గోపాలపురంలో తాడిపూడి మెయిన్ కాలువ 13వ కిలోమీటర్ వద్ద ఆఫ్ టెక్ నుంచి నీటిని తోడేందుకు పంపు హౌస్ ద్వారా సుమారు రెండు కిలోమీటర్లు ప్రెజర్ మైన్ రెండు వరసలు పైపులు 1.3 కిలోమీటర్లు పొడవున ఏర్పాటు చేశారు.

మెయిన్ కెనాల్ గోపాలపురం నుంచి కొయ్యలగూడెం మండలం పొంగుటూరు వరకు 18.4 కిలోమీటర్ల వరకు ఉంది. ఇది సుమారు 200 మీటర్ల వరకు ఎర్త్ వర్క్ పనులు మిగిలి ఉన్నాయి. ట్రైలెండ్ మైనర్ సుమారు 5 కిలోమీటర్ దూరం తవ్వాల్సి ఉంది. మెయిన్ కెనాల్ మీద 8 డిస్ట్రిబ్యూటర్లు ఉన్నాయి. డిస్ట్రిబ్యూటర్ల పొడవు 47.5 కిలోమీటర్లు ఉంది. ఇంకా మూడు కిలోమీటర్లు కాలువ (ఎర్త్ వర్క్) తవాల్సి ఉంది. డిస్ట్రిబ్యూటర్ పైన 26 మైనర్లు ఉన్నాయి. ఇవి సుమారు 50 కిలోమీటర్ల పొడవు ఉన్నాయి. ఇంకా సుమారు 15 కిలోమీటర్ల మేర కాలువ తవ్వాల్సి ఉంది. మైనర్ కాలువల నుండి ఆయికట్టుకు నేరుగా ఫీల్డ్ ఛానల్స్ ద్వారా నీటిని అందిస్తారు. ఇవి మొత్తం మీద సుమారు 200 కిలోమీటర్లకు పైగా కలిగి ఉన్నాయి. డి2 కెనాల్ గోపాలపురం నుండి దేవరపల్లి వరకు 17.300 కిలోమీటర్లు పొడవు ఉంది. దీనిపైన 14 మైనర్లు ఉన్నాయి. గోపాలపురం మండలం దేవరపల్లి మండలాల పరిధిలో 10196 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాలి. ఇంకా కాలువలు తవ్వాల్సి ఉండడంతో అసంపూర్తిగానే నీటిని అందిస్తున్నారు. దీని పరిధిలో అత్యధికంగా జీడిమామిడి, పామాయిల్, పొగాకు పంటలు రైతులు పండిస్తారు. ఈ పొగాకు పంట నవంబర్ నుండి ఏప్రిల్ వరకు ఉంటుంది.

కాంట్రాక్టర్ల అగ్రిమెంట్ 2006-2009 వరకు మాత్రమే ఉన్నప్పటికీ, పలు సంవత్సరాలు అగ్రిమెంట్ సమయం పెంచినా భూ సమస్యలు పరిష్కారం కాలేదు. ప్రారంభంలో అగ్రిమెంటు రేట్లకు ప్రస్తుత రేట్లకు భారీ తేడా రావడంతో ప్రాజెక్ట్ అంచనా వ్యాయామం పనులకు సరిపోకపోవడంతో కాంట్రాక్టర్‌కు తీవ్ర నష్టాలు రావడంతో పాటు భూసేకరణ పూర్తి కాకపోవడంతో పనులు పూర్తి చేయకుండానే ప్రాజెక్టు నుండి వైదొలిగారు. అప్పటి నుండి ఇప్పటి వరకు పనులు తిరిగి ప్రారంభ కాలేదు.

నాలుగేళ్ల నుంచి వాటర్ రెగ్యులేషన్ మెయింటెనెన్స్ చేస్తున్న కాంట్రాక్టర్‌కు బిల్లులు అందించడం లేదని తెలిపారు. దీంతో అందులో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. అయినప్పటికీ అప్పు చేసి కొంత మేరకు మాత్రమే కార్మికులకు అడ్వాన్సుల రూపంలోనే గత నాలుగేళ్లుగా చెల్లిస్తున్నారు. పంపు హౌస్ మెయింటెనెన్స్ వాటర్ రెగ్యులేషన్ ఏ విధంగా చేపట్టాలో అర్థం కావడం లేదని వాపోయారు.

తాడిపూడి మైనర్ కాలువ ఆక్రమణకు గురై రెండేళ్లు గడుస్తున్నా నేటికీ ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు రైతులు అంటున్నారు. తాడిపూడి లిఫ్టు-2 పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ-2లో చైనేజ్ 2.575 కిలోమీటర్ వద్ద ఎం-2 మైనర్ ఉంది. ఈ శివారులో ఒక రైతు తన పొలంలో ఉన్న సుమారు 300 మీటర్లు వరకు కాలువను పూడ్చి దర్జాగా వ్యవసాయం చేస్తున్నాడు. ఆ రైతు పొలంలో రూ.లక్షలతో నిర్మించిన రెండు డ్రాప్ కల్వర్టులు మాత్రమే దర్శనం ఇస్తున్నాయి. మిగిలిన కాలువను మొత్తం పూడ్చిపెట్టి రెండేళ్లుగా పొగాకు పండిస్తున్నాడు.

పూడికతీత లు చేపట్టకపోవడంతో ప్రస్తుతం కాలువ దుస్థితి..

కాలువ ఆక్రమణకు గురవడంతో మిగిలిన కల్వర్టులు

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

తాడిపూడి లిఫ్ట్-2 సంబంధించి మిగిలిన పనులు పూర్తి చేసేందుకు బడ్జెట్ విడుదల చేయాల్సింది. వాటర్ రెగ్యులేషన్ మెయింటెనెన్స్ విధులు సుమారు నాలుగేళ్ల నుంచి రావడం లేదు. అందులో పని చేస్తున్న కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనిపై ఎంఎల్ఎ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం.

**-టి.శ్రీనివాస్, ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్.**

### కాలువల్లో పూడిక తీయడం లేదు

అనేక సంవత్సరాల నుండి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడం లేదు. కాలువలో మట్టి మేటలు, విపరీతంగా మొక్కలు పెరిగిపోయాయి. కాలువ నీరు ముందుకు అతి కష్టంగా వెళుతోంది. డి2 కాలువ మీద అధిక శాతం పొగాకు పంటలు వేస్తున్నాము. వాటర్ రెగ్యులేషన్ చివర సమయం నీటిని నిలుపుదల చేసే సమయంలో పొగాకు పంట సాగు ప్రారంభమవుతుంది. నీటి విడుదల సమయం మరో రెండు మూడు నెలలు నీటిని విడుదల చేయాలి.

**- దుగ్గిరాల శ్రీను, రైతు, వేళ్లచింతలగూడెం.**

## గ్రామాల్లో పట్టాలెక్కనున్న ప్రగతి

**ప్రజాశక్తి-కడియం**

రాష్ట్రాన్ని గత ప్రభుత్వం గాలికొదిలేస్తే కూటమి ప్రభుత్వం గాడిన పెడుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. మండలంలోని దామిరెడ్డిపల్లిలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న మల్టీపర్పస్ యాక్టివిటీ సెంటర్‌కు సోమవారం వారు భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారిని గ్రామ ప్రజలు ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు, సిసి రోడ్లు రోడ్లు, డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణాలు సైతం కూటమి ప్రభుత్వం చేపడుతోందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదన్నారు. ఒక్కొక్కటిగా సమస్యలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందన్నారు. బడ్జెట్ సమావేశాల అనంతరం వివిధ శాఖలకు కేటాయింపులు జరిగిన తర్వాత ప్రగతి పట్టాలెక్కుతుందన్నారు. గత ప్రభుత్వం ఎంఎల్ఎలకు అందించాల్సిన ఏరియల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ ఇవ్వలేదన్నారు. తద్వారా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎంఎల్ఎకు సంబంధిత నిధులు అందిస్తే గ్రామాల్లో అత్యవసర అభివృద్ధికి వినియోగించే అవకాశం ఉండేదన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మళ్లీ సంబంధిత ఫండ్స్ వచ్చేలా చేసి గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముద్రగడ సత్య స్వరూప, ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు విత్తనాల సాయి కుమార్, ఉప సర్పంచ్ ముద్రగడ జెమ్మి పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎంఎల్ఎ

## జిజిఆర్ఎస్‌లో 141 అర్జీల స్వీకరణ

**ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్**

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 141 అర్జీలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడుతో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ కలెక్టర్ పి.ప్రశాంతి అర్జీలను స్వీకరించారు. వివిధ మండలాల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలను స్వీకరించి, సంబంధిత రెవెన్యూ, మండల స్థాయి అధికారులు జూమ్, కాన్ఫరెన్స్ ద్వారా పరిష్కార స్థాయిపై సమీక్ష చేశారు. ప్రజల సమస్యల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ, భూముల సర్వే, అంత్యోదయ బియ్యం రేషన్ కార్డు ద్వారా 35 కేజీల బియ్యం సరఫరా, సదరం ధ్రువపత్రాల, సామాజిక భద్రత పెన్షన్ల కోసం అర్జీలు స్వీకరించారు. గ్రామ పంచాయతీ పరిధిలో శానిటేషన్, విద్యుత్ సరఫరా, భూ ఆక్రమణ, తాగునీరు సరఫరా, మురుగునీరు, టిఫ్ టిడ్కో గృహాల కేటాయింపు తదితర అంశాలపై అర్జీలను స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ, సూచనలు ఇచ్చారు.

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎంఎల్ఎ

### పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీ

**ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్**

ధవలేశ్వరం పోలీస్ స్టేషన్‌లో సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం సౌత్ జోన్ డిఎస్‌పి భవ్య కిషోర్ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో సి.ఐ గణేష్ పాల్గొన్నారు.

### కుర్చీల అందజేత

**ప్రజాశక్తి- గోకవరం**

మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో అంగన్‌వాడీ కేంద్రానికి పెంటిమేను వీరమణి ఆర్థిక సాయం కుర్చీలు వితరణ చేసినట్టు అంగన్‌వడీ కార్యకర్త ఆగస్తమ్మ తెలిపారు. ఈ సందర్భంగా వీరమణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని, విద్యార్థులు ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంజా జ్యోతి, కొడమంచిలి గంగాభవాని, పాల్గొన్నారు.

### కడియం ఎంపిడిఒగా రమేష్

**ప్రజాశక్తి-కడియం**

ఎంపిడిఒగా కె.రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సీతానగరంలో పని చేస్తున్న రమేష్‌ను కడియం ఎంపిడిఒగా నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేస్తున్న రత్నకుమారి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. రత్నకుమారి కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం బదిలీపై వెళ్లారు ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందేంచే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సత్వరమే అందేలా కృషి చేస్తానన్నారు. ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, కార్యాలయ సిబ్బంది, పలువురు కూటమి నాయకులు ఎంపిడిఒకు శుభాకాంక్షలు తెలిపారు.

### కార్టూ'నిజం'




## గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

**ప్రజాశక్తి-రాజమహేంద్రవరం**

రెండో ప్రపంచ యుద్ధానికి ముందు ప్రపంచ పటంలో చోటు లేని ఇజ్రాయిల్ నేడు పాలస్తీనాపై యుద్ధాలు చేస్తూ మెజారిటీ భూమిని ఆక్రమించిందని, ఈ యుద్ధం ప్రపంచ శాంతికి విఘాతం అని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. సోమవారం స్థానిక శ్యామల సెంటర్‌లో సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన పాలస్తీనా సంఘీభావ సదస్సులో అరుణ్ మాట్లాడారు. సొంత భూభాగం కోసం హమాస్ చేస్తున్న పోరాటాన్ని ఇజ్రాయెల్ ఉగ్రవాద సంస్థ అనే నెపంతో సుమారు 40 వేల మంది పాలస్తీనా అమాయక ప్రజానీకాన్ని చంపిందన్నారు. గాజా ప్రాంతం మొత్తాన్ని శ్మశానంగా మార్చారని, పసిపిల్లలు, మహిళలు, వృద్ధులు అనే వ్యత్యాసం లేకుండా పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రార్థన మందిరాలపై కూడా బాంబు దాడులకు తెగబడుతున్న తీరును వివరించారు. ఐక్యరాజ్యసమితి పాలస్తీనాపై దాడిని ఖండించినా అమెరికా ఇజ్రాయెల్‌కు అనుకూలంగా అధిక మొత్తంలో నిధులు, ఆయుధాలు సమకూర్చి యుద్ధాన్ని కొనసాగించడం దారుణం అన్నారు. తొలిసారి యుద్ధం చేస్తున్న దేశానికి మోడీ ప్రభుత్వం ఆయుధాలు అమ్మిందని,ఇది మన దేశ అలీన విదేశాంగ విధానానికి భిన్నంగా అమెరికన్ సామ్రాజ్య వాదానికి తోకగా మారడం అన్నారు. కర్రి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు, బి.పవన్, న్యూడెమోక్రసీ నాయకులు ఎవి.రమణ, జోజి మాట్లాడారు. నాయకులు సుందర్ బాబు, పూర్ణిమరాజు, తాతారావు, రాంబాబు, అశోక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న అరుణ్

## ఇపిఎఫ్ పెన్షన్ రూ.9000 ఇవ్వాలి

**ప్రజాశక్తి-రాజమహేంద్రవరం**

ఇపిఎఫ్ పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని ఇపిఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సోమేశ్వరరావు, సిహెచ్.మోహనరావు డిమాండ్ చేశారు. సోమవారం పిఫ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎపిఆర్‌పిఎ రాష్ట్ర నాయకులు కె.సత్తిరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్.మూర్తి, కెఎస్‌వి.రామచంద్రరావు, బి.పూర్ణిమరాజు, అజయ్ కుమార్, రామదాసు, కృష్ణారావు, ప్రభాకర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు అడిగినా పెన్షన్ పెంచడం లేదన్నారు. 2022-23 లెక్కల ప్రకారం దేశంలో 75 లక్షల మంది పిఫ్ పెన్షనర్స్ ఉన్నారని తెలిపారు. రూ.1000 కన్నా తక్కువ పెన్షన్ తీసుకొనేవారు 36,48,314 మంది ఉన్నారని పేర్కొన్నారు. కార్మికుల సొమ్ము ప్రభుత్వం దగ్గర రూ.7,80,000 కోట్లు ఉందని, దానిపై ప్రభుత్వానికి వచ్చే వడ్డీ రూ.51,985,82 కోట్లు అని, ప్రభుత్వం పెన్షనర్స్‌కు ఇచ్చేది రూ.14,444.6 కోట్లు మాత్రమేనని చెప్పారు. ఈ చాలీ చాలని పెన్షన్‌తో వృద్ధాప్యంలో బతకడం చాలా కష్టమని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంచాలని కోరారు. కనీస పెన్షన్ రూ.9,000, డిఎ ఇవ్వాలని,హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని, రైల్వే ప్రయాణంలో రాయితీ పునరుద్ధరించాలని, భార్య భర్తల ఇద్దరికీ వైద్య సదుపాయం కల్పించాలని తదితర డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు పిఎఫ్ రీజినల్ కమీషనర్ మనోజ్ కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు.

పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పెన్షనర్లు

## విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ తగదు

**ప్రజాశక్తి-రాజమహేంద్రవరం**

రాష్ట్రంలో ఏకైక భారీ ప్రభుత్వ రంగ పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేటీకరించాలని చేస్తున్న ప్రయత్నాలు తగవని పలువురు అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యాకర్తల సమావేశం సోమవారం శ్యామల సెంటర్‌లోని ప్రజా సంఘాల కార్యాలయంలో వి.రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య నాయకులు మాట్లాడుతూ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా యువతను, ప్రజలను చైతన్య పరిచేందుకు సదస్సులు, సెమినార్లు ఏర్పాటు చేయాలని. పిలుపు ఇచ్చారు. రాష్ట్రంలో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతిని వెంటనే ప్రకటించి, అమలు చేయాలని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా సమావేశం ఈ నెల 19 రాజమండ్రిలో జరగనుందని తెలిపారు. ఈ సమావేశం డి.అశోక్ కుమార్, జి.ప్రసన్న కృష్ణ, వివిధ మండలాలకు చెందిన నాయకులు ఎం.జోసఫ్, కె.నాని, టి.శివప్రసాద్, డి.సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

### క్యారీ సంచులు, డస్ట్ బిన్ల పంపిణీ

**ప్రజాశక్తి-పెరవలి**

క్లీన్ పెరవలి.. గ్రీన్ పెరవలిలో.. భాగంగా ఆర్య వైశ్య సంఘం సహకారంతో సోమవారం చెత్తను శుభ్ర పరిచే కార్యక్రమం చేపట్టారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్‌కు ప్రత్యామ్నాయంగా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మంత్రి దుర్గేష్ ఫోటోలతో ముద్రించిన 2 వేల సంచులు, డస్ట్ బిన్‌లను మంత్రి దుర్గేష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గుడివాడ బాలకృష్ణ, వెంకటేశ్వరరావు, గుడివాడ వెంకయ్య, గుడివాడ చిన్న శ్రీనివాస్, గుడివాడ శ్రీహరి, గుడివాడ సోమేశ్వర ప్రసాద్, సలాది ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.

### గోకవరం రీ సర్వే డిటిగా రత్నసాగర్

**ప్రజాశక్తి -గోకవరం**

స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రీ సర్వే డిటిగా రత్నసాగర్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. విద్యాసాగర్ రాజమహేంద్రవరం జిల్లా సివిల్ సప్లై కార్యాలయంలో అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై గోకవరం మండలం వచ్చారు.

### ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ఎంపిక

**ప్రజాశక్తి- గోకవరం**

గోకవరం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా రాయవరపు శ్రీనివాసరావు, పిట్టా అరుణ్ కుమార్‌ను నియమిస్తూ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సోమవారం నియమక పత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసిన వారిని ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని తెలిపారు.

## ఘనంగా అల్లూరి పుట్టిన రోజు

**ప్రజాశక్తి-తాళ్లపూడి**

టిడిపి యువ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. అన్నదేవరపేటకు చెందిన అల్లూరి పుట్టినరోజు వేడుకలో ఎంఎల్ఎ ముఖ్యఅతిథిగా హాజరై అభినందనలు తెలిపారు. పారిశ్రామికవేత్త జివితోపాటు యువగళం జిల్లా నాయకులు కాకర్ల సత్యేంద్ర, నాయకులు కూచిపూడి గణపతి, తొండేపు భరత్ వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు అల్లూరికి శుభాకాంక్షలు తెలిపారు.

జన్మదిన వేడుకల్లో అల్లూరితో కొవ్వూరి ఎంఎల్ఎ

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాశక్తి-చాగల్లు**

మార్కొండపాడు పంచాయతీ కుంకుడుమిల్లిలో డ్రైనేజీ, పంటపొలాలకు వెళ్లే మట్టి రోడ్డును చక్రు రోడ్డుగా నిర్మించేందుకు ఉపాధి నిధులు రూ.25 లక్షలతో సోమవారం శంకుస్థాపన చేసినట్టు టిడిపి నాయకులు సుంకవల్లి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కండ్రిక హరికృష్ణ, బండి శ్రీను, కుంకుడుమిల్లి యంగల ఉదయభాస్కర కృష్ణ, పుసులూరి అనిల్, ఆలపాటి లక్ష్మణరావు, తాతపూడి భద్రయ్య చౌదరి, జొన్నకూటి సురేష్, కస్సె వీర్రాజు, బొల్ల జైరామ్ పాల్గొన్నారు.

### గ్రామాల్లో పరిస్థితులపై అవగాహన అవసరం

**ప్రజాశక్తి-తాళ్లపూడి**

గ్రామాల్లో పరిస్థితులపై పోలీస్ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు కూడాపూర్తి అవగాహన కలిగి ఉండాలని కొవ్వూరు డిఎస్‌పి దేవ కుమార్ అన్నారు. సోమవారం ఆయన తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బదిలీల అనంతరం ఖాళీగా ఉన్న పోలీస్ సిబ్బంది భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తరచూ ట్రాఫిక్ ఇబ్బందులతోపాటు ఆక్రమణలకు గురైన మెయిన్ రోడ్డు సమస్యను డిఎస్‌పి దృష్టికి తీసుకురాగా ఆయన వెంట ఉన్న కొవ్వూరు సిఐ విజయబాబును అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు.

### కనకదుర్గమ్మ ఆలయంలో మంత్రి పూజలు

**ప్రజాశక్తి-కడియం**

మంత్రి కందుల దుర్గేష్, రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య కడియం దేవీచౌక్ సెంటర్లోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. విగ్నేశ్వర తాపీ పనివారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం వారు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు.

### అర్హులందరికీ పెన్షన్ల మంజూరు

**ప్రజాశక్తి-రాజమహేంద్రవరం**

అర్హులైన అందరికీ ప్రభుత్వం పెన్షన్లు అందిచేందుకు చర్యలు తీసుకోనుందని రాజమండ్రి సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని టిడిపి కార్యాలయం వద్ద భవానీ ఛారిటబుల్ ట్రస్టు తరపున పలువురికి పెన్షన్లు, ఒక చిరు వ్యాపారికి నాలుగు చక్రాల తోపుడు బండిని ఎంఎల్ఎ అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భవానీ ఛారిటబుల్ ట్రస్టు స్థాపించిన నాటి నుంచి విద్య, వైద్యం, క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈసారి నిరుపేదలను గుర్తించి వారికి తమ ట్రస్టు తరపున పెన్షన్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కాశి నవీన్ కుమార్, కుడుపూడి సత్తిబాబు, మజ్జి రాంబాబు, మరుకుర్తి రవి యాదవ్, కోకోనట్ వాసు, కంటిపూడి రాజేంద్రప్రసాద్, చింతపల్లి నాని, కానేటి ప్రభుదాసు పాల్గొన్నారు.

### నీటిపారుదల, అభివృద్ధిపై సమీక్ష

**ప్రజాశక్తి -దేవరపల్లి**

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిపి కెవికె.దుర్గారావు అధ్యక్షతన వ్యవసాయ నీటిపారుదల, ఇతర మండలాభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు మాట్లాడారు. వ్యవసాయ, తాగునీరు, ధాన్యం కొలుగోలు, విద్యుత్తు, ఎడ్యుకేషన్, హౌసింగ్, వరి సేకరణ, ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్వర్ణాంధ్ర-2047 అంశాల గురించి మాట్లాడారు. గోదావరి డ్రింకింగ్ వాటర్ సరఫరా గురించి పలు కీలక అంశాలుపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజ్యలక్ష్మి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేణుగోపాల్ రెడ్డి, ఎఇ నారాయణ అప్పారావు పాల్గొన్నారు.

### వైద్య ఖర్చుల కోసం మానవత సాయం

**ప్రజాశక్తి-తాళ్లపూడి**

విద్యా వైద్య ఖర్చులకోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తులను కుటుంబాలను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మండల మానవత శాఖ అధ్యక్షులు అంకెం సురేష్ అన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై వైద్య ఖర్చులకోసం ఎదురుచూస్తున్న మండలంలోని రాగోలపల్లి గ్రామానికి చెందిన పిల్లి బోయిన రమేష్‌కు మండల మానవత శాఖ సోమవారం రూ.6 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షునితో పాటు సనపల రాజశేఖర్, పి.దుర్గాప్రసాద్, టి.రామ్మోహనరావు, కె.వెంకటేశ్వరరావు, కె.పోసిరావు, జి.అనిల్, ఆర్.లిఖిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## పట్టపగలు చైన్ స్నాచింగ్

ప్రజాశక్తి - కోటనందూరు

తుని పట్టణంలో పట్టపగలు చైన్ స్నాచింగ్ దొంగలు రెచ్చిపోతున్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మహిళ మెడలోంచి తాళిబొట్టు లాక్కెళ్లిన దుండగులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుని మండలం వెలమ కొత్తూరు గ్రామానికి చెందిన కర్రీ లక్ష్మి పోస్ట్ ఆఫీస్ వీధిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళుతుండగా 25 సంవత్సరాల వయసున్న ఇద్దరు యువకులు ఒకరు బండిపై నెమ్మదిగా వెళుచుండగా మరొకరు వెనకాలే నడుచుకుంటూ వచ్చి మెడలో ఉన్న పుస్తెలతాడు లాక్కుని బైక్‌పై పరారయ్యారు. ఆ దశ్యాలు అక్కడే ఉన్న సిసి కెమెరాలలో రికార్డు అవ్వడంతో చైన్ స్నాచింగ్ పాల్పడిన ఇద్దరు యువకులు కోసం గాలింపు చేపట్టడం జరుగుతుందని అన్నారు.

## బాలికపై అఘాయిత్యం

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలో మైనర్ బాలికపై అఘాయిత్యం జరిగింది. మాధవపురం రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డ్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న బాలికను ఆటోలో ఎక్కిస్తుండగా ఒక మహిళ గుర్తించింది. దగ్గరకి వెళ్ళి తెలిసిన బాలికగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. దీంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని అపస్మారస్థితిలో ఉన్న బాలికను చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలిక ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీని పై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ శ్రీనివాస్ తెలిపారు.

## పిడిఎస్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - పిఠాపురం

నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో సోమవారం జాతీయ రహదారిపై ఓ ప్రయివేట్ స్కూల్ సమీపంలో ఒక వాహనాన్ని విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు అదుపులోకి తీసుకుని తనిఖీలు చేశారు. ఆ వాహనంలో 26 బస్తాలలో సుమారు 1,320 కేజీల పిడిఎస్ బియ్యంను గుర్తించారు. గొల్లప్రోలుకు చెందిన వాహన యజమాని వి.వాసు సూచనల మేరకు డ్రైవర్ వి.గుర్రయ్య పిడిఎస్ బియ్యంను పెద్దాపురం ఏరియాలోని కోళ్ళ ఫామ్‌లకు రవాణా చేస్తున్నట్లు తెలిపారన్నారు.సీజ్ చేసిన పిడిఎస్ బియ్యంతోపాటు, వాహనం విలువ సుమారు రూ.9,60,720 ఉంటుం దని రీజనల్ విజిలెన్స్ ఇన్‌ఛార్జ్ ఎస్‌పి ఎం.స్నేహిత తెలిపారు. యజమానిపై 6ఎ కేసు నమోదు చేసి సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నిమిత్తం సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సిఫార్స్ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో పిడిఎస్ అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఎవరైనా పిడిఎస్ బియ్యాన్ని కొనడం, అమ్మడం చేస్తే సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, నవీన్‌కుమార్, వలీ, జీవానందం, సిఎస్‌డిటి పాల్గొన్నారు.

## 5,400 లీటర్ల డీజిల్, వాహనాల సీజ్

ప్రజాశక్తి - తాళ్లరేవు రూరల్

యానం నుంచి నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న డీజిల్‌ను, రెండు వాహనాలను కోరంగి పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఎస్ఐ పి. సత్య నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. యానాం నుంచి ద్రాక్షారామం మీదుగా 3,000 లీటర్ల డీజిల్ తరలిస్తున్న వాహనాన్ని గోవలంక ఏటుగట్టు వద్ద, రావులపాలెం వైపు తరలిస్తున్న 2,000 లీటర్ల డీజిల్ వాహనాన్ని అరటికాయలంక వద్ద సీజ్ చేసినట్లు తెలిపారు.

## పేకాడుతున్న ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని రంపఎర్రంపాలెం గ్రామ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.4,500 లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలో సిహెచ్ గున్నేపల్లికి చెందిన ఎఎన్ఎం మొల్లి మంగాయమ్మ సోమవారం స్కూటీపై డ్యూటీకి వెళ్తుండగా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం సెంటర్లో వెనక నుంచి ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ఎఎన్ఎంతోపాటు చిన్నారి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నూతన పాలకవర్గాన్ని అభినందిస్తున్న అభిమానులు

## సొసైటీ ఛైర్‌పర్సన్‌గా ప్రమీల

ప్రజాశక్తి - పిఠాపురం

ది పిఠాపురం అర్బన్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ బ్యాంకు ఛైర్‌పర్సన్‌గా చెల్లుబోయిన ప్రమీల, వైస్ ఛైర్మన్‌గా మేళం రామకష్ణ, డైరెక్టర్లుగా అరిగెల ప్రసాదరావు, అద్దంకి వెంకట రమణ, బాలిపల్లి రామచంద్ర కుమార్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారి పి దుర్గాప్రసాద్ వారితో ధృవీకరణ పత్రాలపై సంతకం చేయించారు. ఈ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, జనసేన నాయకులు సూరవరపు సురేష్, పిల్లా శివ శంకర్, మార్నిడి రంగబాబు వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

# జిపిఎస్ మత్స్యకారులకు రక్షణ కవచం

ప్రజాశక్తి - కాకినాడ

మత్స్యకారుల సంక్షేమం కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న (జిపిఎస్) ట్రాన్స్‌పాండర్స్ రక్షణ కవచంలా ఉంటుందని ఎంఎల్‌ఎ వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక జగన్నాథపురం రాష్ట్ర మత్స్య కార సాంకేతిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మత్స్యకార బోటు యజమానులకు ట్రాన్స్‌పాం డర్స్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్రాన్స్‌పాండర్స్ వేటకు వెళ్ళే బోట్లకు అమరుస్తారని, తద్వారా బోట్ల ఉనికి, బోటు లేదా సిబ్బంది ప్రమాదంలో ఉన్నట్లయితే రక్షణ, వాతావరణ, తుపాను హెచ్చరికలు అందుకునేందుకు, చేపల సమాచారం తెలుసు కునేందుకు, సముద్రంలో దేశ సరిహద్దులు దాటే సమయంలో హెచ్చరికలు తెలుసు కునేందుకు ఉపయోగపడుతుందన్నారు.

యజమానులకు ట్రాన్స్‌పాండర్స్ అందజేస్తున్న ఎంఎల్‌ఎ కొండబాబు

గత ప్రభుత్వం మత్స్యకారులకు చేసిందేమీ లేదన్నారు. మత్స్య కారులకు ఇచ్చిన పథకాలు, నియమించిన కమిటీలు కేవలం అలంకార ప్రాయంగా మిగిలా యన్నారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అన్నివిధాలా అండగా ఉంటుందని తెలిపారు. సాంకేతికత వినియోగించుకుని వ్యాపారాభివృద్ధి చెందాలని సూచించారు. ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, మత్స్యశాఖ డిప్యూటి డైరెక్టర్ కరుణాకర్ మాట్లాడారు. మత్స్యకార నాయకులు బలసాడి రంగారావు, నాగేశ్వరరావు మత్స్యకారుల సమస్యలను ఎంఎల్ఎకి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బోటు యజమానులు పాల్గొన్నారు.

# పెరిగిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

అకాల వర్షాలతో మార్కెట్లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలపై పెను భారం పడుతోంది. కూరగా యలు కొనలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు నిత్యా వసర వస్తువుల ధరలు సైతం విపరీతంగా పెరగ డంతో పూట గడవని స్థితిలో సామాన్యులు ఉన్నారు. వర్షాల వలన దిగుబడి తగ్గడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ క్రమంలో కూరగాయాల ధరలు ఏకంగా రూ.100కు చేరువలో ఉన్నాయి. ఇప్పటికే టమోటా రూ.100 పలుకుతోంది. ఎపి, తెలంగాణలో గత వారం ఉల్లి కేజీ రూ.60 ఉండగా.. ప్రస్తుతం రూ.80కి చేరింది. టమోటా గతవారం కేజీ రూ.50 నుంచి 60 మధ్యలో ఉండగా, కొన్ని ప్రాంతాల్లో రూ.100 పలుకుతుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో

రూ.80 నుంచి 90 మధ్య పలుకుతోంది. దసరా పండుగ నాటికి అన్ని కూరగాయాలు రూ.100 చేరువ కావొచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే పెరుగుతున్న కూరగాయల ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో షటిల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కాకినాడ

దసరా ఉత్సవాల సందర్భంగా కాకినాడ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో షెటిల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఆఫీసర్స్ క్లబ్ ఆవరణలో జరిగిన ఈ టోర్నమెంట్ ఆఫీసర్స్ క్లబ్ ప్రతినిధులు యు.రామకృష్ణ, పొన్నాడ హరి సారథ్యంలో జరిగాయి. ఈ టోర్నమెంటులో 20 టీములు పాల్గొనగా ఉడత రామకృష్ణ, ఐ.భాస్కర్ జట్టు విన్నర్స్‌గానూ, పొన్నాడ సత్యనారాయణ, మల్లాడి రవితేజ్‌వర్మ జట్టు రన్నర్స్‌గా నిలిచారు. తృతీయ స్థానాల్లో బుడితి సురేష్‌కుమార్, ఉడత రాజేష్, అల్లం లక్ష్మిరెడ్డి, వీర వెంకటసత్యనారాయణ

విజేతలకు బహుమతులు అందిస్తున్న నాగేశ్వరరావు

నిర్వాహకులు ఎంపిక చేశారు. శ్రీ అగస్త్య జూనియర్ కాలేజ్ అండ్ మెడికల్ అకాడమీ డైరెక్టర్ డి.నాగేశ్వరరావు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిరోజు వ్యాయామం అవసరమని అన్నారు.

# ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగించాలి

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పోస్టర్స్‌ను తొలగించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో ఈ మేరకు ఆయన ఫిర్యాదు చేశారు. నగరంలోని కాకినాడ టుటౌన్ బ్రిడ్జి, మెయిన్ రోడ్, సినిమా రోడ్, దేవాలయం వీధి, నూకాలమ్మ గుడి వీధి, సాలిపేట గరల్స్ హైస్కూల్ ప్రాంతాల్లో కలెక్టర్ ఉత్తర్వులు లెక్కచేయకుండా విచ్చలవిడిగా ఫ్లెక్సీలు కట్టారని, జవహర్ వీధిలో ఘంటసాల విగ్రహాన్ని సైతం ఫ్లెక్సీలతో మూసివేశారని తెలిపారు. ఇలా నగరంలో ఎక్కడ చూసినా ఫ్లెక్సీలు, పోస్టర్లే కన్పిస్తున్నాయని తెలిపారు. తక్షణమే వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# జాతీయ స్థాయి పోటీలకు నవర విద్యార్థిని

ప్రజాశక్తి - సామర్లకోట

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు మండలంలోని నవర జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.చాందిని ఆహ్లాదిక ఎంపికైంది. రాజమహేంద్రవరంలో జరిగిన ఎపి రాష్ట్ర అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ పోటీలో ఆమె పాల్గొని జావెలిన్ త్రో విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం, షార్ట్ పుట్‌లో తృతీయ స్థానంలో నిలిచింది. దీంతో ఆమెను జాతీయ స్థాయి పోటీలకు ఎంపికకు అర్హత సాధించింది. ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకూ గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని పాఠశాల హెచ్‌ఎం సత్యవతి, పిడి ఎస్.జయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఛాందినీ ఆహ్లాదికను పుష్పగుచ్ఛం,

విద్యార్థినిని సత్కరిస్తున్న సర్పంచ్, ఇతరులు

దుస్సాలువాతో సత్కరించి రూ.2500 నగదు ప్రోత్సాహాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దమ్మాల లక్ష్మణరావు, ఎస్‌ఎంసి ఛైర్మన్ కుంచె రాంబాబు, వైస్ ఛైర్మన్ గవ్వ హేమ, పాఠశాల స్థలదాత సిద్ధి భవన్నారాయణ, తాటికొండ శ్రీనివాస్, తోట నాగభూషణము, వెన్న నూకరాజు, మలిరెడ్డి బుచ్చిరాజు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాలకు 121 దరఖాస్తులు

ప్రజాశక్తి - తాళ్ళరేవు రూరల్

తాళ్ళరేవు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, తాళ్లరేవు, కరప మండలాలకు సంబంధించి 17 మద్యం దుకాణాలకు 121 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సిఐ కె.కోటేశ్వర్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 1వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందన్నారు. 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## బాలల హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి

బాలల హక్కులపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి అన్నారు. సోమవారం మండలంలోని మురారి గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలల హక్కులు, లైంగిక వేధింపులు, బాలల చట్టాలు, మంచి స్పర్శ, చెడు స్పర్శ, బాలల హెల్ప్‌లైన్ 1098 వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం పి.వెంకటలక్ష్మి, ఐసిడిఎస్ సిబ్బంది జి.కరుణ కుమారి, డి అనంతలక్ష్మి, కె సుజాత, ఆశా వర్కర్ జ్యోతి, హెల్పర్స్ విమల, శ్యామల, పాల్గొన్నారు.

## సామర్లకోటలో స్వచ్ఛ రైల్వే ట్రాక్

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం స్వచ్ఛ రైల్వే ట్రాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామర్లకోట రైల్వేస్టేషన్‌లో మంచినీటి కుళాయిలు శుభ్రపరచడం, డస్ట్ బిన్ లలో చెత్తను తొలగించడం, రైల్వే ట్రాక్‌పై చెత్తను తొలగించడం, డ్రెయినేజీలు శుభ్రపరచడం వంటి కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ బి.శివప్రసాద్, రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, సఫాయివాల సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధిపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివద్ధిపై అవగాహన అవసరమని ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ సత్యనారాయణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని ఉపసర్పంచులు, ప్రతి పంచాయితీ నుంచి ఇద్దరు వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పిబివి.రమణ, రిసోర్స్‌పర్సన్స్ పాల్గొన్నారు.

## ఆదిత్యలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో దేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 5వ రోజైన సోమవారం జరిగిన చండీదేవి అలంకరణలో ఉన్న దుర్గమ్మకు డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం, డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి, శతి రెడ్డి దంపతులచే ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 13వ తేదీన దుర్గమ్మ ఊరేగింపు నిమజ్జనం జరుగుతాయని నల్లిమిల్లి శేషారెడ్డి తెలిపారు. ఆలయ అర్చకులు శ్రీరామ్‌శర్మ, ప్రసాద్ పూజ విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌ఛార్జ్ జి.హరీష్ రెడ్డి, ఆదిత్య సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఆదాయంపై దృష్టి సారించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణ పరిధిలో మున్సిపల్ ఆదాయం పెంపుదలపై సిబ్బంది ప్రత్యేక దష్టి పెట్టాలని ఆర్‌జెడి బి.శ్రీనివాసమూర్తి ఆదేశించారు. సోమవారం ఆయన పెద్దాపురం మున్సిపాలిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలలో అక్రమ కట్టడాలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. వీటిని సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గుర్తించాలన్నారు. పట్టణ శివారులో అక్రమ లే అవుట్లు కూడా పెరుగుతున్నాయన్నారు. వీటన్నింటినీ గుర్తించి ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం వారిపై

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జెడి

చర్యలు తీసుకోవటమే కాకుండా ప్రభుత్వం నిర్ణయించిన రీతిలో అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. అనంతరం పలు అంశాలపై సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఫణికుమార్ పాల్గొన్నారు.

## నిఘా ద్వారానే లింగ నిష్పత్తి పరిరక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్కానింగ్ సెంటర్‌పై నిరంతర నిఘా ద్వారానే లింగ నిష్పత్తి పరిరక్షణ చేయగలమని ఆర్‌డిఒ కె.శ్రీరమణి అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శిశు లింగ నిర్ధారణ చట్టం పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఉన్న స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణ పరీక్షలు జరపకుండా ఉండేలా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఁ

## సత్తెమ్మతల్లి ఆలయంలో ఎంఎల్ఎ దాట్ల పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట అయోధ్య రామపురంలో ఉన్న సత్తెమ్మ తల్లి ఆలయంలో ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ప్రత్యేక పూజలు చేశారు. విజయ దశమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆయన సత్తెమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను వీరభద్ర జ్యోతిష్యాలయ నిర్వాహకులు చీమలకొండ వీరభద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి కార్యదర్శి బడుగు శ్రీకాంత్, ఆలయ కమిటీ ఛైర్మన్ పోలినాటి సూర్యచంద్ర, కొచ్చర్ల శివ,లయన్స్ క్లబ్ కోశాధికారి బడుగు సీతారామరాజు పాల్గొన్నారు.

**ఒరిజినల్ దస్తావేజులు పోయినవి**

చెక్కా సురేష్, S/o. అప్పారావు (లేటు), డో.నెం. 5-27, చర్చి ఎదురు వీధి, పాత హరిజనపేట, సర్పవరం, కాకినాడ రూరల్, కాకినాడ జిల్లా, సర్పవరం మా ఇంటి వద్ద నుండి సినిమా రోడ్డుకు వెళ్ళే మార్గం మధ్యలో (దారి) **డాక్యుమెంట్ నెంబర్ 16726/2022, 16727/2022** రెండు ఒరిజినల్ దస్తావేజులు ది. 27-09-2024వ తేదీన జిరాక్స్ తీయించుటకు బైక్ మీద వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. కావున ఎవరికైనా దొరికినచో ఈక్రింది నెంబర్‌కు తెలియజేయగలరు.

**చెక్కా సురేష్**
**సెల్: 9030301077**

## రామచంద్రపురం ఆర్‌డిఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం ఆర్‌డిఒగా ఖాతిబ్ కౌసర్ భానో సోమవారం భాద్యతలు స్వీకరించారు. ఆమె కడప నుండి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన ఆర్‌డిఒ సుధాసాగర్ విజయవాడ ప్రభుత్వ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆర్‌డిఒగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన భానోను కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

ఖాతిబ్ కౌసర్ భానో

## హక్కులు, విధులపై అవగాహన

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రాజ్యాంగ పీఠికలో పొందుపర్చిన ప్రాథమిక హక్కులు- విధుల పై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాశాఖ అధికారి బి.రమణశ్రీ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల నందు సోమవారం ఇండియన్ సోషల్ ఇన్స్టిట్యూట్ బెంగుళూరు వారి సహకారంతో పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ముమ్మిడివరం, బాలిక ఆర్గనైజేషన్ అయినవిల్లి మరియు కార్మిలేట్ సిస్టర్స్ ఆఫ్ థెరిస్సా ఆర్గనైజేషన్ అమలాపురం ల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు 'ప్రజాస్వామ్యం - రాజ్యాంగం' అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని ట. నాగరాజా రావు అధ్యక్షతన నిర్వహించారు. ఎంఇఒ రమణ శ్రీ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ రాజ్యాంగ పీఠిక లోని ప్రధాన అంశాలపై యువతకు చేరే విధంగా స్వఛ్ఛంద సంస్థలు క షి చేయడానికి ముందుకురావడం హర్షణీయం అన్నారు. మరో అతిథి ఐసిడిఎస్ సిడిపిఒ వి.విమల మాట్లాడుతూ రాజ్యాంగం పట్ల,ప్రతి ఒక్కరూ విధేయత కలిగి ఉండాలని సూచించారు.ఎన్ అబ్బులు మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ భారతదేశం అని దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కె వెంకటేశ్వరరావు బాలిక ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఎమ్ శ్రీనివాసరావు లతో పాటు స్వఛ్ఛంద సంస్థల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు తదితరులు

## సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-అమలాపురంసిటీ

ఉప్పలగుప్తం మండలం విలసవిల్లి గ్రామంలో దళితపేటల్లో సమస్యలు పరిష్కరించాలని బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. విలసవెల్లి గ్రామంలో మూడు దళిత పేటలు, భీమ్ నగరం, వడ్డువారిపేట బీరవారి పేట లో 400 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరి కుటుంబాలలో ఎవరైనా మరణిస్తే శ్మశానానికి తీసుకువెళ్లడానికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రజలు ప్రధాన రోడ్డు మార్గం నుండి దళిత గ్రామాలకు వెళ్లడానికి సరైన రోడ్డు మార్గం లేక ఇక్కట్లు పడుతున్నారు. బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాలమూరు మోహన్ బాబు మాట్లాడుతూ నేటికీ దళితులకు కనీసం శ్మశానానికి వెళ్లడానికి రోడ్డు మార్గం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు అధికారులు దళితుల సమస్యలు పరిష్కారానికి క షి చేయాలని కోరారు. తక్షణం విలసవిల్లి గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కుంచె బాబులు, అంబేద్కర్, కారెం వెంకటేశ్వరరావు, వెన్నపు దొరబాబు, వస్కా మల్లేశ్వర రావు భీమవరపు నరేష్, బీర వెంకట్రావు, చికురుమిల్లి సువర్ణ రాజు, వజ్రపు లారెన్స్, మెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## 9న 'వికాస' ఆధ్వర్యంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-అమలాపురంసిటీ

వికాస వారి ఆధ్వర్యంలో 9వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు వికాస సంస్థ జిల్లా కార్యాలయము నందు జాబ్ మేళా నిర్వహిస్తారన్నారు. జిల్లా లోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైభవ్ జ్యువెలర్స్ నందు సేల్స్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూ టివ్, క్యాషియర్, ఎలక్ట్రిషియన్, గోల్డ్ అప్రైజర్, డ్రైవర్, ఆఫీస్ బాయ్, మార్కెటింగ్ ఫీల్డ్ ఉద్యోగాలకు బుధవారం వికాస ఆఫీస్ కలెక్టరేట్ నందు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పైన తెలిపిన ఉద్యోగాలకు జువెలరీ రంగంలో గానీ లేదా రిటైల్ రంగంలో గానీ కనీసం అనుభవం ఉండాలని మరిన్ని వివరాలకు www.vik asajobs.com నందు చూడగలరని జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్ తెలిపారు.

## 3500 దరఖాస్తుల స్వీకరణే లక్ష్యం

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ వరప్రసాద్

ప్రజాశక్తి - ఆలమూరు

జిల్లా పరిధిలో మద్యం దుకాణాలకు సుమారు 3500 దరఖాస్తుల స్వీకరణే లక్ష్యమని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సాధనాల కనక దుర్గా వరప్రసాద్ అన్నారు. దరఖాస్తుల ద్వారా రూ. 70 కోట్లు ఆదాయం లభిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఆలమూరులోని ఎక్సైజ్ కార్యాలయాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ ఐడీ నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా గతంలో 150 మద్యం దుకాణాలు ఉండగా ప్రస్తుతం జనాభా ప్రాతిపదికన యూనిట్‌గా తీసుకుని 133 మద్యం దుకాణాలకు ప్రభుత్వం కుదించిందన్నారు. దానికనుగుణంగా మండలం లేదా పట్టణంలోని 50 వేల జనాభా ప్రాతిపదికన దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈనెల మూడు నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో ఇప్పటి వరకూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ (సీఎఫ్ఎంఎస్) విధానంలో 311 దరఖాస్తులు అందాయన్నారు. ఇప్పటి వరకూ క్షేత్రస్థాయిలో అందుతున్న సమాచారాన్ని బట్టి ఈనెల తొమ్మిది లోపు బారీ స్థాయిలో ధరఖాస్తులు అందుతాయని భావిస్తున్నామన్నారు. జిల్లాలో రామచంద్రపురం, ముమ్మిడివరం పట్టణాల్లో జనాభా ప్రాదిపదికన బట్టి లైసెన్స్ ఫీజును రూ.55 లక్షలుగా నిర్ణయించగా మిగిలిన ప్రాంతాల్లో రూ. 65 లక్షలుగా ఫీజులను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటికే తమశాఖ తీసుకుంటున్న కఠిన చర్యల వల్ల ఇతర రాష్ట్రాల నుంచి ఎన్‌డీపీఎల్ మద్యం బాటిళ్ల సరఫరా పూర్తిగా తగ్గిపోయిందని సూపరిండెంటెండ్ ప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం మద్యం దుకాణాలకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియను ఆయన పరిశీలించారు.

**ఆలమూరు ఎక్సైజ్ పరిధిలో ..**

స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాల దరఖాస్తుల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. సర్కిల్ పరిధిలోని ఆలమూరు, మండపేట రూరల్, కపిలేశ్వరపురం మండలాలతో పాటు మండపేట పట్టణంలో 20 దుకాణాలను ఏర్పాటుచేస్తుండగా ఇప్పటి వరకూ కేవలం 27 దరఖాస్తుల మాత్రమే అందాయి.

## రేపటితో ముగుస్తున్న దరఖాస్తుల స్వీకరణ

**కొత్తపేట:** నూతన మద్యం పాలసీ విధానంలో దరఖాస్తులను ఈనెల 9న సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ కాత్యాయని సోమవారం తెలిపారు. షాపునకు దరఖాస్తు చేసుకునే వ్యక్తి డిపిఅండ్ ఇఒ కోనసీమ డిస్ట్రిక్ట్ పేరు మీద డిడి తీయాలన్నారు. అలాగే ఒకటి కన్నా ఎక్కువ అప్లికేషన్లు ఇచ్చే వ్యక్తి తమ ప్రతినిధి డిక్లరేషన్ ఫామ్ అందజేయాలన్నారు. ఈ నెల 11వ తారీకు ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద లాటరీ తీస్తారని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఎంట్రీ ఫామ్ తో లాటరీ సమయానికి ముందే హాజరు కావాలన్నారు. ఒకటి కన్నా ఎక్కువ దరఖాస్తులు ఇచ్చిన వ్యక్తి తాను హాజరు కాలేని పక్షంలో తమ ప్రతినిధి పంపవచ్చు అన్నారు. అయితే దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఆధార్ కార్డు, ప్రతినిధి ఆధార్ కార్డు, డిక్లరేషన్ ఫామ్, ఎంట్రీ పాస్ తో సహ తీసుకురావాలని సూచించారు.

**In the Court of the IVth Additional District Judge at Kakinada**
**O.S. No. 111/2015**

*Between:*
Palacharla Venkayamma ...*Plaintiff*
AND
Kakara Bapiraju and Others ...*Defendants*

*To:*
*D-33:* Yendru Varalakshmi, W/o. Yendru (late) Pattabhi Ramayya, Hindu, House wife, D.No. 6-22, Sai Centre, Katravulapalli, Jaggampeta Mandal.
*D-34:* Yendru Siva Subrahmanyam, S/o. Yendru (late) Pattabhi Ramayya, Hindu, Employee, R/o. D.No. 6-22, Sai Centre, Katravulapalli, Jaggampeta Mandal.
*D-35:* Yendru Sruthi, D/o. Yendru (late) Pattabhi Ramayya, Hindu, Employee, R/o. D.No. 6-22, Sai Centre, Katravulapalli, Jaggampeta Mandal.

పై నెంబరు దావాలో 33వ, 34వ మరియు 35వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 18-10-2024 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
**బోయనపల్లి రాధాకృష్ణ**
**ఎ.అనిల్‌కుమార్ రాజా**
అడ్వకేట్స్, కాకినాడ
సెల్: 9440323951

**PRINCIPAL DISTRICT COURT, EAST GODAVARI AT RAJAMAHENDRAVARAM**
**TENDER NOTICE**

Sealed tenders are invited for supply of 55 CPM Photocopier Machine for use in the Principal District Court, East Godavari at Rajamahendravaram.
Hence, intended suppliers are informed to submit quotations by 5 P.M. of 21-10-2024 in the name of "The Principal District Judge, East Godavari, Rajamahendravaram". The detailed terms and conditions can be downloaded from the URL: https://eastgodavari.dcourts.gov.in/notice/tender-notification/

*Sd/-* **PRINCIPAL DISTRICT JUDGE**

దావా సమను
**మహారాజశ్రీ పెద్దాపురం ప్రిన్సిపల్ సివిలు జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు**
**O.S. No. 209 of 2019**

*Between:*
చింతా బాపిరెడ్డి -వాది
AND
1. తుమ్మపూడి మల్లేశ్వరి
2. ఒజ్జి లక్ష్మికుమారి -ప్రతివాదులు

*To:*
*1వ ప్రతివాది:* తుమ్మపూడి మల్లేశ్వరి,
*D-1:* తుమ్మపూడి మల్లేశ్వరి, W/o. సాంబశివరావు, D/o. రాజమండ్రి వీరాస్వామి, వయస్సు 56 సం॥లు, హిందువు, అటెండర్ in A/O ఆఫీస్, A.P.S.P.D.C.L. Ltd., చిట్టినగర్ సెక్షన్, 1-టౌన్, డో.నెం. 5-6-59/106/బి, రైతు బజార్ ఎదురుగా, ఫ్రేజర్ పేట, విజయవాడ 520001, కృష్ణ జిల్లా, నివాసం: డో.నెం. 1-184, ఉండవల్లి, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా.

పై నంబరు దావా ది. 18-10-2024వ తేదీన పై కోర్టున వాయిదా అయి వున్నది. పై దావా నందు మీకు ఏదైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టున **ది. 18-10-2024వ తేదీన ఉదయం 10.30 గంటల** నుండి మీరు స్వయంగా గాని, మీ న్యాయవాదితో గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరు అయి మీ వాదనను తెలుపవలెను. లేని ఎడల మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్పు చెబుదురు.

(శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం)
పెద్దాపురం **M.K.మొహియుద్దీన్**
ది.03-10-2024 అడ్వకేట్, పెద్దాపురం

నోటీసు
**మహారాజశ్రీ పెద్దాపురం ప్రిన్సిపల్ సివిలు జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు**
**I.A. No. 755 of 2019 in O.S. No. 209 of 2019**

*Between:*
చింతా బాపిరెడ్డి -పిటిషనర్
AND
1. తుమ్మపూడి మల్లేశ్వరి
2. ఒజ్జి లక్ష్మికుమారి -రెస్పాండెంట్లు

*To:*
*1వ రెస్పాండెంట్:* తుమ్మపూడి మల్లేశ్వరి,
*R-1:* తుమ్మపూడి మల్లేశ్వరి, W/o. సాంబశివరావు, D/o. రాజమండ్రి వీరాస్వామి, వయస్సు 56 సం॥లు, హిందువు, అటెండర్ in A/O ఆఫీస్, A.P.S.P.D.C.L. Ltd., చిట్టినగర్ సెక్షన్, 1-టౌన్, డో.నెం. 5-6-59/106/బి, రైతు బజార్ ఎదురుగా, ఫ్రేజర్ పేట, విజయవాడ 520001, కృష్ణ జిల్లా, నివాసం: డో.నెం. 1-184, ఉండవల్లి, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా.

పై నంబరు పిటీషను ది. 18-10-2024వ తేదీన పై కోర్టున వాయిదా అయి వున్నది. పై పిటీషను నందు మీకు ఏదైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టున **ది. 18-10-2024వ తేదీన ఉదయం 10.30 గంటల** నుండి మీరు స్వయంగా గాని, మీ న్యాయవాదితో గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరు అయి మీ వాదనను తెలుపవలెను. లేని ఎడల మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్పు చెబుదురు.

(శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం)
పెద్దాపురం **M.K.మొహియుద్దీన్**
ది.03-10-2024 అడ్వకేట్, పెద్దాపురం